కొడుక్కు చెప్పేది. తన కుటుంబం కోసం కోపాన్ని అదుపులో ఉంచుకోవడం నేర్చుకున్నడు తిరుపతయ్య.

ఓరోజు పక్కూరి భిక్షుమయ్య పందుల్ని కొనడానికి వచ్చి.. ఓ ముచ్చట చెప్పి పోయిండు.

''మా ఊళ్లో సావుకారి కోడలి మెల్లో గొలుసు పోయిందట.. నాలుగు సవర్లు ఉంటదట. దేవులాడుతుండ్రు. ఎవలు తీసిండ్రో ఏందో.. పోలీసోల్లు వస్తుండ్రట. ఏమైద్దోనని గుబులైతంది. ముందుగాల్న మనవేగదా ఆళ్ల కండ్లకు అగుపడ్తం!'' అని దిగులుగా చెప్పిండు.

ఎందుకో తిరుపతయ్య మనసు మెలిపెట్టినట్టయ్యింది. నిన్న మంగవ్వ ఆ ఊళ్లోనే సోది చెప్పనీకి పోయిందని భయపడ్డడు.

సరాబోళ్ల బిడ్డకు నొప్పులొస్తున్నయంటే.. తయారై ఊళ్లోకి పోయింది నాగమ్మ. వాళ్లు చీరిస్తే కట్టుకుంది. కొత్త బ్లేడు తెమ్మని చెప్పింది. వేడినీళ్లు మసలబెట్టమని చెప్పి.. కానుపయ్యే అమ్మాయి కాళ్లకాడ కూసుంది. కానీ, 'పెనిమిటి ఎట్లున్నడో!?' అనే ఆలోచిస్తా ఉంది.

చెట్టును పగలగొట్టుకుని వచ్చినట్టుగా బిడ్డ బైటికొచ్చింది.



ఉమ్మ నీరొచ్చి నాగమ్మ ముఖాన్ని తడిపేసింది. ఆ జిగటనంతా చెంగుతో తుడుసుకుంది. బిడ్డకు బొడ్డు కోసింది. మాయ, మైల గుడ్డంతా మట్టి కుండలోకి ఎత్తిపెట్టింది. గుడ్డతోటి బాలింతకు నడికట్టేసింది. పక్క సాపు చేసింది. బిడ్డ ఒంటికున్న మైల వొదలగొట్టి.. తానం జేపిచ్చింది. పురిటి స్నానం అయ్యేంతవరకూ నాగమ్మ ప్రతి రోజూ వచ్చి.. బిడ్డకు స్నానం చేయించాలె. దానికి ధాన్యమో, నూకలో, పైసలో ఇస్తరు.

''పోయొత్త!'' అని చెప్పి, కట్టుకున్న మైలచీర కుండలో కుక్కి.. తన చీర కట్టుకుని, కుండ పట్టుకుని బయల్దేరింది నాగమ్మ. ఊరి పక్కనున్న అడవిలో చెట్టు కింద కుండ పడేసి, ఇంటికొచ్చి పడింది.

తిరుపతయ్య అట్లనే నీరసంగా పండుకుని ఉన్నడు.

నాగమ్మ స్నానం చేసి వచ్చి.. కాసింత గంజిని గిన్నెలోకి వొంపి మొగని ముందెట్టింది.

''ఏంది గట్లున్నవ్!??'' అని ఎన్నిసార్లు అడిగినా.. తిరుపతయ్య నుంచి సమాధానం లేదు. తన భయం ఏందో చెప్పలేదు.

సోది చెప్పనీకి పోయిన మంగవ్వ.. పందులు గూట్లో చేరే టైముకు ఇల్లు చేరింది. కొడుకు అట్ల ఎందుకున్నడోనని కోడల్ని అడిగింది. అందరూ అన్నంతిని పడుకున్నరు. ఆ రాత్రి తెల్లారనంటూనే తెల్లగా తెల్లారింది.

మంగవ్వ సద్దిగంజి తాగి, తాంబారు బుట్ట తీసుకొని బయల్దేరింది. తిరుపతయ్య ఆమెనే చూస్తూ ఉన్నడు.

అంతలోనే ఓ పదిమంది దూకుడుగా వచ్చిండ్రు.

''రండ్రా! దొంగనా కొండిల్లారా!'' అంటూ మంగవ్వ చేతిలో బుట్టను లాక్కొని, గాల్లోకి ఎగరకొట్టిండ్రు. అడ్డకోబోయిన తిరుపతయ్యను పక్కకు నెట్టేసిండ్రు. మంగవ్వ అడ్డురాబోతే.. డొక్కలో తన్నిండ్రు. నాగమ్మ లబోదిబోమంటూ నెత్తి బాదుకున్నది. పిల్లలిద్దరూ బిక్కుబిక్కుమంటూ దూరంగా పారిపోయి ఏడుస్తున్నరు. చుట్టూ ఉన్న కులపోళ్లు కంగారుగా అక్కడికి చేరిండ్రు. దొరల్ని ఎదురించే ధైర్యం ఎవరికీ లేదు. వచ్చింది ఎవరో? ఎందుకు కొడుతున్నరో ఎవరికీ తెలుస్తలేదు.

''ఏమయ్యింది?'' అని అడిగిండు ఎంకటయ్య.

''నిన్న సోది జెప్పనీకి వచ్చి సావుకారు కోడలమ్మ మెల్లో ఉండే గొల్సు ఎత్తుకొచ్చిందంట.. ఈ దొంగలం..'' అంటూ మంగవ్వ జుట్టు పట్టుకుని, వొంగదీసి దభీదభీమని గుద్దేసిండు బలంగా ఉన్న ఒకడు.

''సచ్చిన్రా దేవుడో! నాకేం తెల్వు. బాంచెన్ మీ కాల్మొక్త! నన్ను ఇడ్సి పెట్టుండ్రి!'' అంటూ గింజుకున్నది మంగవ్వ. అక్కడ చేరినవాళ్లు అడ్డుపోలేక.. నిస్సహాయంగా చూస్తున్నరు.

''మీ అందర్నీ దొర తీస్కరమ్మంటుండు!'' అంటూ దొర పక్కన ఉండే కోటయ్య వచ్చి చెప్పిండు.

అందరూ దొర వాకిట్లో చేరిండ్రు. దొర గంభీరంగా అందర్నీ చూస్తూ..

''మా ఊళ్లోకొచ్చి మీ లొల్లేందిరా? మీరే పంచాయితీ చేస్తరా ఏంది? ఇంక ఈడ మేమెందుకు? బర్లు కడగనీకా ఏంది?'' అని అనగానే.. సావుకారు ముందుకొచ్చిండు.

''నిన్న మొగోళ్లు లేని టైము చూసి.. సోది జెప్పనీకి వచ్చిందీ ఎరుకల్ది. మందెట్టి గొల్సు ఎత్తుకొచ్చేసింది దొరా! సోదంటూ వచ్చి దొంగతనానికి మరిగిండ్రు ఈ ఎరుకలోళ్లు! నాలుగు సవర్ల గొల్సు దొరా!''.. ఫిర్యాదు చేస్తూనే, మంగవ్వ వైపు కాలెత్తి తన్నిండు.

''నాకే పాపం తెల్వది దొరా! నిప్పుల్ల దుంకమంటే దుంకుతా! నూనెల సెయ్యేట్టమంటె పెడ్త! గెడ్డపార దూయమంటె దూస్త దొరా! కానీ, నన్ను దొంగ.. అనొద్దు దొరా!'' అంటూ ఏడ్చింది మంగవ్వ.

దొర అటువాళ్లతో మంతనాలు జరిపిండు.

''రెండు రోజులు టైమిస్తున్న. ఈ లోపట వస్తువు తిరిగియ్యుండ్రి. లేదంటే పోలీసోళ్లు సూస్కుంటరు మీ సంగతంత. ఇంకోపాలి గిట్లాంటి లొల్లి జర్గితే.. నా కాలి చెప్పుతోని కొట్టి చంపుత!'' కండ్లెర్రజేసి చెప్పిండు దొర.

తలొంచుకొని ఇంటికొచ్చిండ్రు అందరూ.

'లేని వస్తువును రెండు దినాలల్ల ఏడనుంచి తేవాలె? నాల్గు పందులమ్మి పైసలు గడ్తె.. నింద నిజమంటరు!' ఆలోచిస్తూ దిగులుగా కూలబడ్డడు తిరుపతయ్య .

దెబ్బలకు సగం సచ్చిపోయిన మంగవ్వ.. నిందకు పూర్తిగా సచ్చినట్టు అయ్యింది. మర్నాడు బడికి పోయిన పిల్లలు.. దిగాలేసుకున్న మొహంతో తిరిగొచ్చిండ్రు.

''పోరగాళ్లు ఏడిపిస్తున్నరు నాయ్నా! కొన్ని దినాలు బడికి రాకండ్రని పంతులమ్మ సెప్పింది..'' అంటూ కండ్లు తుడుసుకున్నరు.

మంగవ్వ గుండె పగిలేలా ఏడ్చింది. సాయంత్రం బైటికి పోయిన మంగవ్వ తిరిగి రాలేదు.

''అత్త గప్పుడనంగ పోయె.. గింతదాక రాలె!'' అని నాగమ్మ చెప్పంగనే.. దిగ్గున లేచి పరిగెత్తిండు తిరుపతయ్య. అంతా దేవులాడిండు. మంగవ్వ జాడలేదు. దొర పొలంలో కలుపు తీతకు పోయిన ఎరుకల ఎంకటయ్య ఉరుక్కుంట వచ్చి చెప్పిండు.

''తిరుపతయ్యా! మీయమ్మ సింతసెట్టుకు ఏల్లాడుతందిరా! ఊపిరొదిలేసింది!'' అంటూ నెత్తి బాదుకున్నడు.

పిల్లాజెల్లాతోపాటు అందరూ పరిగెత్తిండ్రు. చింత కొమ్మకు వేలాడుతున్న మంగవ్వ.. తన బతుక్కు తానే ఎరుక చెప్పుకొన్నది. మంగవ్వ చచ్చిపోయి రోజులు గడుస్తున్నా.. పెద్ద మనుషులు కబురెట్టలేదు.

'గొల్సు దొరికుంటది. అన్నేయంగా ముసల్దాని ఉస్రు పోస్కుంట్రి!' అని గుసగుసలాడుకున్నరు కులపోళ్లు.

పూల రెక్కలు రాలినంత నిశ్శబ్దంగా రోజులు దొర్లిపోతూ ఉన్నయి.

* * *

మల్లేశు పదో క్లాసులోకి అచ్చిండు. మాలచ్మికి పెండ్లి సంబంధం కుదిరింది. పెండ్లి రేపనంగ.. దొర వాకిట్ల నిలబడి పెండ్లి సంగతి చెప్పిండ్రు తిరుపతయ్య – నాగమ్మ.

''మంచిది! ఇప్పసారాలుగట్ర తాగి కొట్లాటలు పెట్టుకుంటే మంచిగుండది. రేపొచ్చి పెండ్లి ఇనాం పట్కపోండ్రి!'' అన్నడు దొర.

''మంచిది దొరా!'' అంటూ వెనకెనక్కి నడుసుకుంట గుమ్మం దాటిండ్రు.

మర్నాడు పెండ్లికి చుట్టపోళ్లు, కులపోళ్లు.. చప్పుళ్ల మధ్యన తిని, తాగి ఎగిరిండ్రు.

''మల్లేసూ! ఎంకన్న దొర పెండ్లి ఇనాం ఇస్తనన్నడు. జరపోయి పట్కరా! మీ నాయ్న తాగుతున్నడు'' అని కొడుకును పిల్చి..చెప్పి పంపింది నాగమ్మ.

దొర ఇంటికి వెళ్లిన మల్లేశు గుమ్మం దగ్గర్నుంచే..

''దొరా! దొరా!'' అని పిలిచిండు.

''ఓరి మల్లేసూ! తానాల దొడ్డి పక్కన కుండల ఎంగిలన్నం ఉంటది. కూసింత పట్కరారా!'' అని పురమాయించిండు గొడ్లకాడ సాపు చేస్తున్న రంగయ్య.

రాత్రి పడేసిన అన్నంతో కుడితి వాసన గొడ్తంది. కుండ తియ్యబోతూ.. దొడ్డికున్న రంధ్రంలోంచి లోపలికి చూసిండు మల్లేసు. దొరగారి కోడలమ్మ తానం జేస్తూ కనిపించింది. అప్పుడే అటచ్చిన దొరసాని చూసి..

''ఏందిరా!? ఆడ ఏం సేత్తున్నవ్!?'' అని అరిచింది.

భయంతో మల్లేశు కుండ వదిలేసిండు. ఎటు పోవాల్నో తెలవనట్టు నిలుసుండి పోయిండు.

''ఏముంది ఆడ!?'' అంటూ రంధ్రంలోంచి చూస్తే.. స్నానం చేస్తున్న కోడలు కనిపించింది.

దొరసాని ఊగిపోతూ..

''ఆడ్ని పట్టుకోండ్రి!'' అని అరిచింది.

బైటికి పరిగెత్తబోయిన మల్లేశు కాలికి కర్ర అడ్డంపడి కింద పడ్డడు. పాలేరోళ్లు పరుగునొచ్చి మల్లేశును పట్టుకున్నరు. విషయం తెలిసి చిన్న దొరసాని ఏడుసుకుంట పొయ్యి.. జరిగిన సంగతి భర్తకు చెప్పింది. అగ్గిరాజుకున్నట్టు మండిపోయిన చిన్నదొర జగన్నాథం.. బైటికొచ్చి, మల్లేశు గుడ్డలూడదియ్యమని, కాళ్లు చేతులు కట్టేసి.. దిసమొలతోని ఎర్రటి ఎండల గచ్చు అరుగుమీద పడెయ్యమన్నడు. నీటి చుక్క ఇయ్యద్దని చెప్పిండు.

ఎండ మండిపోతూ ఉంది. నూలుగుడ్డ లేని ఒంటిని చూసుకోలేక.. అమ్మనూ, నాయ్ననూ తల్సుకుంట ఏడుస్తున్నడు మల్లేశు. చచ్చిపోతే బాగుండని అనుకుంటున్నడు. అప్పటికే చిన్నదొర కొట్టిన దెబ్బలు వాతలు తేలినయి. బాగా చదువుకోవాలని, ఉజ్జోగం చేసుకుంట.. అమ్మానాయ్నను బాగా చూసుకోవాలని అనుకున్నడు.